సాక్షి
రంగారెడ్డి
శనివారం । 28 । డిసెంబర్ । 2024



కొయ్యలను కాల్చొద్దు

పంట కోతలు పూర్తయిన తర్వాత రైతులు పొలంలోని వరి కొయ్యలను కాల్చుతూ సాగుకు సిద్ధమవుతున్నారు. 10లో▸



రెండు బైక్‌లు ఢీ

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. 10లో▸



ప్రపంచ శాంతికోసమే..

ధ్యాన మార్గంలో పత్రీజీ చేసిన సేవలు ప్రశంసనీయమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న జీపీ కార్మికులు

కేశంపేట: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జీపీ వర్కర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి అన్నారు. సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం జీపీ కార్మికులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 12,790 పంచాయతీల పరిధిలో 60వేల మంది కార్మికులు పని చేస్తున్నారని అన్నారు. 500 జనాభాకు ఒక్క కార్మికుడి పేరును ఆన్‌లైన్‌లో అధికారులు ఎంట్రీ చేశారని గుర్తుచేశారు. జనాభా ప్రాతిపదికన కాకుండా ప్రస్తుతం పని చేస్తున్న ప్రతి ఒక్కరినీ ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలన్నారు. పని చేస్తున్న కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, జీఓ 51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, అర్హులైన కార్మికులను బిల్ కలెక్టర్లు, కారోబార్లు, సహాయ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా జనరల్ సెక్రెటరీ రాంచందర్, పరేషా, యాదయ్య, మల్లయ్య, మాసయ్య, పద్మ, బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో కలపొద్దు



ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల: నూతనంగా ఏర్పాటు చేయనున్న చేవెళ్ల మున్సిపాలిటీలో తమ గ్రామాన్ని విలీనం చేయొద్దంటూ రామన్నగూడ గ్రామస్తులు శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్లకు దూరంగా ఉన్న తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపొద్దన్నారు. గ్రామంలో ఇప్పటికీ ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. మున్సిపాలిటీలో కలిపితే పన్నుల భారాన్ని తట్టుకోలేమని వాపోయారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా జరుగుతున్నట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది. ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, ఆ మేరకు జీహెచ్‌ఎంసీ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో 84 వేల మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలుగనుంది. గతంలో ప్రజాపాలనలో అందిన దరఖాస్తుదారుల ఇళ్లను మాత్రమే సర్వే చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. అలాంటి వారు జీహెచ్‌ఎంసీలో 10,70,446 మంది ఉన్నారు. వారి ఇళ్ల సర్వేకు వార్డుల వారీగా టీమ్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 94 వేలకు పైగా దరఖాస్తుదారుల ఇళ్ల సర్వే పూర్తయింది. జోనల్ కమిషనర్ల పర్యవేక్షణలో, డిప్యూటీ కమిషనర్ల నేతృత్వంలో సర్వే ముమ్మరంగా జరుగుతోందని జీహెచ్‌ఎంసీ పేర్కొంది.

చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభం వాయిదా


కుషాయిగూడ: చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం వాయిదా పడింది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అకాల మరణం కారణంగా శనివారం జరగాల్సిన టెర్మినల్ ప్రారంభ కార్యక్రమం వాయిదా వేశారు. వారం రోజుల పాటు సంతాప దినాలుగా ప్రకటించడంతో ప్రారంభోత్సవ తేదీని తిరిగి ఖరారు చేసే అవకాశం ఉందని రైల్వేవర్గాలు పేర్కొన్నాయి.

డ్రగ్స్ ఆనవాళ్లు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

గచ్చిబౌలి: నగర పరిధిలో డ్రగ్స్ ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ సూచించారు. కొత్త సంవత్సర వేడుకల్లో పోలీసుల నిబంధనలు అందరూ విధిగా పాటించాలని స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం ఈవెంట్ల నిర్వాహకులు, పబ్ యజమానులు, మేనేజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవెంట్లు, పబ్ నిర్వాహకులు విధిగా ప్రత్యేక పార్కింగ్‌ను, సొంతంగా సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మద్యం సేవించిన వారి వాహనాలకు డ్రైవర్లను నిర్వాహకులే ఏర్పాటు చేయాలన్నారు. వాహనాలు లేకపోతే ట్రాన్స్‌పోర్టు సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అవినీతి మరకలు!

YEAR 2024 ROUNDUP



అప్పనంగా ప్రభుత్వ భూములు కట్టబెట్టారని..

- పనికింత రేటు కట్టి.. టేబుల్ కింద చేయిపెట్టారని..
- ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని..
- ఏసీబీకి పట్టుబడిన అధికారులెందరో..
- జిల్లాకు మచ్చ తెచ్చిన అవినీతిపరులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎగుమతుల ఖిల్లాగా గుర్తింపు పొందిన జిల్లాను ఈ ఏడాది అనేక అవినీతి మరకలు అప్రతిష్ఠ పాలు చేశాయి. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, రిజిస్ట్రేషన్స్, సర్వే విభాగాల్లోని కొన్ని అవినీతి తిమింగలాలు అపఖ్యాతిని మిగిల్చాయి. ఐటీ, అనుబంధ రంగాలతో పాటు రియల్ ఎస్టేట్ రంగాల్లో ఆదర్శంగా నిలిచిన జిల్లా కొంత మంది అధికారుల తీరుతో చెడ్డపేరు మూటగట్టుకోవాల్సి వస్తోంది.

ధరణి చుట్టే అక్రమాలు

భూముల ప్రక్షాళనలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి సాంకేతిక పరిజ్ఞానం,ఆ ముసుగులో చోటు చేసుకున్న అక్రమాలు నిత్యం వార్తల్లో నిలి చేలా చేసింది. ఓ కలెక్టర్, ఓ అదనపు కలెక్టర్ సహా పలువురు తహసీల్దార్లపై ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

- ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్ భూములను కొంత మంది పెద్దలకు అప్పనంగా కట్టబెట్టారనే ఆరోపణలపై ఏకంగా కలెక్టర్‌గా పని చేసిన అమోయ్‌కుమార్‌పై ఏసీబీ కేసు నమోదు చేసింది. కందుకూరు, మహేశ్వరం తహసీల్దార్లపైనా ఇవే ఆరోపణలపై కేసులు నమోదు కావడం గమనార్హం.
- నిషేధిత జాబితా నుంచి భూమిని విడిపించేందుకు నాదర్‌గుల్‌కు చెందిన ఓ రైతు నుంచి రూ.8 లక్షలు తీసుకుంటూ అదనపు కలెక్టర్‌గా ఉన్న భూపాల్‌రెడ్డి సహా సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి ఏసీబీకి చిక్కడం సంచలనం సృష్టించింది. ఆ తర్వాత ఆయనపై ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే కేసు సైతం నమోదైంది.
- బఫర్‌జోన్లలో నిర్మాణాలకు నిరభ్యంతర పత్రాలు జారీ చేసి, నెక్నంపూర్‌కు చెందిన బొమ్మ నరేందర్‌రెడ్డి నుంచి రూ.2.50 లక్షలు తీసుకుంటూ జిల్లా నీటిపారుదలశాఖ ఇంజనీర్ బన్సీలాల్, అసిస్టెంట్ ఇంజనీర్ కె.కార్తీక్, ఎస్‌ఈ ఆఫీసులోని ఏడబ్ల్యూ సెక్షన్ ఏఈ హెచ్.నిఖేష్‌కుమార్, గండిపేట సర్వేయర్ పి.గణేశ్ మే 31న ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారు. వీరిలో కీలకమైన నిఖేశ్‌కుమార్ ఆదాయానికి మించి రూ.500 కోట్లకుపైగా ఆస్తులు కూడబెట్టినట్లు విచారణలో తేలింది.

యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సర్వేలో..

ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న సమస్యల్లో అవినీతి ఒకటి. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ నిర్వహించిన సర్వేలో విస్తుపోయే అంశాలు వెలుగు చూశాయి. రాష్ట్ర వ్యాప్తంగా 14,345 మందిని సర్వే చేయగా, 76.7 శాతం రెవెన్యూశాఖలో అవినీతి ఉన్నట్లు తేలింది. ఆ తర్వాతి స్థానంలో విద్యుత్‌శాఖ 59.7 శాతం, రిజిస్ట్రేషన్ల శాఖ 55.4 శాతం, పోలీసు శాఖ 52.3 శాతం, మున్సిపల్ శాఖ 49.4 శాతం, ఎక్సైజ్‌శాఖ 47.8 శాతం, ట్రెజరీ 46.4 శాతం, రవాణాశాఖ 42.1 శాతం, అటవీ శాఖలో అతి తక్కువగా 28.2 శాతం అవినీతి ఉన్నట్లు వెల్లడైంది. అక్రమ వసూళ్లకు పాల్పడుతూ ఏసీబీకి చిక్కిన వారిలో అత్యధికం జిల్లా ఉద్యోగులే ఉండడం గమనార్హం.

మరికొన్ని మచ్చలు

- గొర్రెల పంపిణీ పథకం స్కాంతో సంబంధం ఉన్న జిల్లాకు చెందిన అప్పటి పశు సంవర్ధకశాఖ అధికారి అంజలప్ప, భూగర్భ జలవనరులశాఖ అధికారి రఘుపతిరెడ్డిని ఏసీబీ అరెస్ట్ చేసింది.
- శంషాబాద్ మండలం నర్కుడ పంచాయతీ మాజీ కార్యదర్శి, కారోబార్ సహా ననాజీపూర్ పంచాయతీ కార్యదర్శి, కారోబార్‌ను ఏసీబీ అరెస్ట్ చేసింది.
- జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తిపై కూడా అక్రమ వసూళ్ల ఆరోపణలు రావడంతో ఆమెను మరో చోటికి బదిలీ చేశారు.
- భూదాన్ భూముల్లో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించారనే అభియోగంపై బాటసింగారం, తారామతిపేట కార్యదర్శులపై వేటు వేశారు.
- సైబరొ ఎటీ, రాజేంద్రనగర్ సర్కిళ్లలో పని చేస్తున్న పలువురు ఏడీఈలు, డీఈలపై కూడా వేటు తప్పలేదు.

ఏడాదిలో ముగ్గురు కలెక్టర్లు

ఏడాది కాల వ్యవధిలోనే జిల్లాలో ముగ్గురు కలెక్టర్లు మారారు. వివాదాస్పద భూములకు క్లియరెన్స్ ఇచ్చారనే ఆరోపణలపై సీనియర్ ఐఏఎస్ అధికారి భారతిహోళికేరిని తప్పించి, ఆ స్థానంలోకి హరీశ్‌ను తీసుకొచ్చారు. ఆ తర్వాత ఎంపీ ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై కమిషన్ వేటు వేసింది. ఆ స్థానంలో శశాంక నియమితులయ్యారు. ప్రజాప్రతినిధుల ఒత్తిడికి ఆయన కూడా ఎక్కువ కాలం కొనసాగలేక పోయారు. ముక్కుసూటిగా వ్యవహరించే శశాంకను తప్పించి, ఆయన స్థానంలో ఇటీవల సి.నారాయణరెడ్డిని నియమించారు. ఇలా ఒకే ఏడాది ముగ్గురు కలెక్టర్లు మారడం.. మాజీ కలెక్టర్లపై ఏసీబీ కేసులు నమోదు కావడం.. మచ్చగా మిగిలాయి.

ఆ భయం వల్లేనా!

భారీగా పడిపోయిన గ్రేటర్ టౌన్‌ప్లానింగ్ ఆదాయం



సాక్షి, సిటీబ్యూరో: హైడ్రా భయం భవన నిర్మాణాలపై ప్రభావం చూపుతోంది. గతంలో వచ్చిన ఆదాయం ఈ ఏడాది రాలేదు. చెరువులు, సరస్సులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా ప్రజల్లో.. ముఖ్యంగా రియల్టర్లలో వణుకు పుట్టిస్తోంది. వాస్తవానికి హైడ్రా రియల్టర్ల జోలికి వెళ్లడం లేదు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల మేరకు చెరువులను కబ్జాచేసి నిర్మిస్తున్న భవనాలనే కూల్చివేస్తోంది. అనవసర భయాలతో రియల్టర్లు కొత్త ప్రాజెక్టులకు వెనుకడుగు వేస్తున్నట్లు కనిపిస్తోంది. గడచిన ఆర్థిక సంవత్సరం (2023–24) జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ద్వారా రూ.1,695 కోట్ల ఆదాయం జీహెచ్‌ఎంసీ ఖజానాకు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) అక్టోబర్ నెలాఖరు వరకు వచ్చింది రూ.459 కోట్లు మాత్రమే. నవంబర్, డిసెంబర్‌లలోనూ పెద్ద నిర్మాణాల అనుమతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

లేనిపోని భయాలు

కొత్త నిర్మాణాలకు రియల్టర్లు వెనుకడుగు వేస్తుండటంతో మెజార్టీ రియల్టర్లు ఇంత కాలం చెరువులు, సరస్సులను కబ్జాచేసే నిర్మాణాలు చేశారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇప్పటికే భారీ నిర్మాణాలు జరిగినందున ఖాళీ స్థలాలంటూ లేనందున కొత్తగా నిర్మాణాలు జరగడం లేవని టౌన్‌ప్లానింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే సాచురేషన్ స్థాయి మించిపోయిందని అంటున్నాయి. పాతభవనాలను కూల్చి అధునాతనంగా నిర్మించే వారుంటే తప్ప పెద్ద నిర్మాణాలు వచ్చే అవకాశాల్లేవని కూడా చెబుతున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

మోసాలతో కాంగ్రెస్ పాలన

- జీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ పాలన అంతా అబద్ధాలు, మోసాలతో సాగుతోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఆరోపించారు. రాబోయే స్థానిక ఎన్నికల కోసం పార్టీ శ్రేణులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బూత్ కమిటీ ఎన్నికలు, సంస్థాగత ఎన్నికల నిర్వహణ, పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. హామీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఇచ్చిన ఏ ఒక్క గ్యారెంటీనీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. నిరంకుశ పాలనకు స్వస్తిచెప్పి ప్రజాస్వామ్య పాలన అందిస్తామని.. నియంతృత్వ, నిరంకుశ పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. లగచర్ల భూ సేకరణపేరిట రైతులపై అక్రమ కేసులను పెట్టడం, పోలీసులతో దాడులు చేయించడం అందుకు ఉదాహరణ అన్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన, భూ సేకరణపేరిట పేదల ఇళ్లను కూలగొడుతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ ఉద్యమిస్తుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రేమేందర్‌రెడ్డి పార్టీశ్రేణులకు సూచించారు. పార్టీని బూత్‌స్థాయి నుంచి సంస్థాగతంగా బలోపేతం చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ మంచి విజయాలు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు ఆచారి, పార్టీ సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్, ఎన్నికల అధికారి కట్ట సుధాకర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీప్‌చారి, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఘన నివాళి

షాద్‌నగర్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

వానరానికి అంత్యక్రియలు



కొడంగల్ రూరల్: మండలంలోని పర్సాపూర్‌లో శుక్రవారం ఉదయం అనారోగ్యంతో వానరం మృతి చెందింది. గమనించిన పరిసరవాసులు గ్రామస్తులకు తెలియజేశారు. దీంతో స్థానికులు, హిందూవాహిని సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. వానరాన్ని ట్రాక్టర్‌లో ఉంచి టపాసులు కాలుస్తూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అంత్యక్రియలు జరిపించారు.

సీపీఎం సభలకు సిద్ధం

- నేడు, రేపు పార్టీ జిల్లా మహాసభలు
- ముస్తాబవుతున్న ఇబ్రహీంపట్నం
- హాజరుకానున్న రాష్ట్రస్థాయి నేతలు



మాట్లాడుతున్న పార్టీ నేతలు

ఇబ్రహీంపట్నం: సీపీఎం జిల్లా మహాసభలకు ఇబ్రహీంపట్నం ముస్తాబవుతోంది. శని, ఆదివారాల్లో నిర్వహించనున్న సభల కోసం ప్రధాన చౌరస్తాలు, రోడ్ల వెంట, డివైడర్లపై ఎర్ర జెండాలు రెపరెపలాడుతున్నాయి. మహాసభలకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు వెలిసాయి. మొదటిరోజు శనివారం మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో భారీ బహిరంగసభ ఏర్పాటు చేశారు. పార్టీ చేస్తున్న పోరాటాలు, చేయాల్సిన కార్యక్రమాలను వివరించనున్నారు. సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జాన్‌వెస్లీ, డీజీ నరసింహారావు హాజరుకానున్నారు. మరుసటి రోజు ఆదివారం వరకు స్థానిక భారత్ గార్డెన్‌లో జరిగే ప్రతినిధుల సభలో వివిధ అంశాలపై చర్చించనున్నారు. ప్రధానంగా జిల్లాలో నెలకొన్న ప్రజా సమస్యలపై చర్చించడంతోపాటు వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నారు. పార్టీ జిల్లా నూతన సారథులను ఎన్నుకోనున్నారు. కొత్త కార్యవర్గం ఎన్నిక, వివిధ అంశాలపై చేసిన తీర్మానాలతో సభలు ముగుస్తాయి.

జయప్రదం చేయండి

ఇబ్రహీంపట్నంలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గసభ్యులు పగడాల యాదయ్య, సామేల్ పిలుపునిచ్చారు. మహాసభల ఏర్పాట్లను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీపీఎం నిరంతరం పేదల, కార్మికుల, కష్టజీవుల హక్కుల కోసం పోరాడుతుందని అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం కోసం అంకితభావంతో ఉద్యమిస్తుందన్నారు. కార్మికులు, కర్షకులు, మహిళలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సభల్లో చర్చించి భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాల నిర్ణయాలను ప్రకటిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై తిరుగుబాటు బావుటా ఎగురవేసేందుకు ఈ మహాసభలు వేదిక కానున్నట్లు చెప్పారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, అభిమానులు, అనుబంధ సంస్థల నేతలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.జగన్, నర్సింహ, శ్యాంసుందర్, ఎల్లేష్, జగన్, వీరేష్, స్వప్న, బుగ్గరాములు, ప్రకాశ్‌కారత్, శంకర్, స్వామి, యాదగిరి, చరణ్, దశరథ, రజాక్‌పాష పాల్గొన్నారు.

అప్పు.. తీర్చేదెప్పుడు?

స్పష్టమైన హామీ ఇచ్చి తీరాలి

- రైతులకు డీసీసీబీ నోటీసులు
- విచారణ మొదలుపెట్టిన అధికారులు
- నోటీసుల జారీతో వాయిదాల చెల్లింపులు షురూ

యాచారం: 'అప్పు చెల్లింపుపై స్పష్టమైన హామీ ఇవ్వండి.. లేదంటే ఆస్తుల జప్తునకు సహకరించండి' అంటూ డీసీసీబీ లీగల్ సెల్ అధికారులు రైతులకు నోటీసులు జారీ చేస్తున్నారు. యాచారం పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం)లో 15 ఏళ్లుగా 750 మంది రైతులు తమ వ్యవసాయ పట్టాదారు, పాసుపుస్తకాలను తాకట్టు పెట్టి రూ.12 కోట్లకు పైగా దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నారు. ఏటా మార్చి 30లోపు అప్పు వాయిదాలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ నేటికీ పైసా కట్టలేదు. అధికారులు పలుమార్లు రైతులను కలిసి అప్పులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అయినా స్పందన లేకపోవడంతో గత నవంబర్ చివరలో నోటీసులు జారీ చేశారు. అప్పులు ఎందుకు చెల్లించడం లేదో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని, చెల్లింపుపై స్పష్టమైన హామీ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

లీగల్ నోటీసులపై విచారణ

నోటీసులు జారీ చేసిన అధికారులు వాటిల్లో పేర్కొన్న తేదీల ప్రకారం రైతులను పిలిచి వివరణ తీసుకుంటున్నారు. డీసీసీబీ జాయింట్ రిజిస్ట్రార్ సూర్యచందర్‌రావు పర్యవేక్షణలో లీగల్ సెక్షన్ అధికారి లక్ష్మారెడ్డి రైతులను విచారిస్తున్నారు. ఏళ్లు గడిచినా తీసుకున్న అప్పు ఎందుకు చెల్లించడం లేదు.. పౌల్ట్రీ, డెయిరీ ఫాంలు నిర్వహించడం లేదా గొర్రెలు, మేకల పెంపకం చేయడం లేదా.. అప్పు లక్ష్యాన్ని పక్కాదారి పట్టించారా.. తాకట్టు పెట్టిన (మార్టిగేషన్) వ్యవసాయ పొలాలను విక్రయించారా.. అలానే ఉన్నాయా.. అనే వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. అప్పు ఎప్పుడు చెల్లిస్తారో తేదీలతో సహా రాతపూర్వకంగా హామీ పత్రాలు తీసుకుంటున్నారు.

జప్తునకు సహకరించండి

అప్పులు పొంది ఏళ్లుగా చెల్లించకపోవడంతో వడ్డీ కూడా బాగా పెరిగింది. 750 మంది రైతులు రూ.12 కోట్లకు పైగా బకాయి ఉన్నారు. అప్పుతోసహా వడ్డీ కూడా సమానంగా పెరగడం, తాకట్టు పెట్టిన ఆస్తుల విలువ పెరగడంతో లీగల్ సెల్ అధికారులు రంగంలోకి దిగారు. అప్పులు చెల్లిస్తారా.. ఆస్తులు జప్తు చేయమంటారా అంటే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నోటీసులపై కొందరు రైతులు స్పందిస్తుండగా మరికొందరు పట్టించుకోవడం లేదు. దీంతో అధికారులు రైతుల ఇళ్లు, వ్యవసాయ పొలాల వద్దకు సైతం వెళ్తున్నారు. కొంతమంది తమ వద్ద ఉన్నంతలో కొద్ది మేర చెల్లిస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో రూ.20 లక్షలకు పైగా వసూలయ్యాయి. మరికొందరు రైతులు ఫార్మాసిటీలో తమ భూములు పోయాయని, అప్పులెలా చెల్లించేది అంటూ ప్రశ్నిస్తున్నారు. వీరి నుంచి ఎలా రికవరీ చేయాలనే విషయమై లీగల్ సెల్ అధికారులు ఉన్నతాధికారులను సంప్రదిస్తున్నారు.



లీగల్ నోటీసుల జారీతో స్పందించి అప్పు వాయిదా చెల్లిస్తున్న రైతు

వడ్డీ మాఫీ చేయాలి



యాచారం పీఏసీఎస్‌లో 2019లో దీర్ఘకాలిక రుణం కింద రూ.3,73,840 అప్పు తీసుకున్నాను. ఆర్థిక పరిస్థితుల కారణంగా సకాలంలో వాయిదాలు చెల్లించలేదు. కొద్ది రోజుల క్రితమే అధికారులు నోటీసులు అందజేశారు. మొత్తం అప్పులో సగం వరకు పక్షం రోజుల లోపు చెల్లిస్తానని హామీ పత్రం ఇచ్చాను. వడ్డీ మాఫీ చేస్తే బాగుంటుంది.

– నేనావత్ పంతు, రైతు, మంతన్‌గౌరెల్లి

ఉన్నతాధికారుల ఒత్తిళ్లు



దీర్ఘకాలిక బకాయి వసూళ్లపై ఉన్నతాధికారుల నుంచి తీవ్ర ఒత్తిళ్లు ఉన్నాయి. అందుకే రైతులకు లీగల్ నోటీసులిచ్చాం. నోటీసుల్లో పేర్కొన్న తేదీల ప్రకారం రైతులు వచ్చి అధికారుల ముందు వివరణ ఇస్తున్నారు. కొందరు వాయిదా డబ్బులు చెల్లిస్తుండగా, మరికొందరు ఎప్పుడు చెల్లించేది రాతపూర్వకంగా హామీ ఇస్తున్నారు.

– నాగరాజు, సీఈఓ, యాచారం పీఏసీఎస్

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

- ఒకరి మృతి
- దంపతులకు గాయాలు


ఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

చేవెళ్ల: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం అంగడి చిట్టింపల్లి గ్రామానికి చెందిన రాజమల్లయ్య(53) వ్యక్తిగత పనుల నిమిత్తం చేవెళ్లకు వచ్చాడు. సాయంత్రం తిరుగుప్రయాణంలో మిర్జాగూడ స్టేజీ సమీపంలో మండల పరిధిలోని ఇక్కరెడ్డిపల్లికి చెందిన రామస్వామి, మాధవి దంపతులు బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాజమల్లయ్య తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దంపతులకు గాయాలవ్వడతో చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేపు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచ శాంతికోసమే ధ్యానం


వేడుకకు హాజరైన ధ్యానులు

- పత్రీజీ కృషి ప్రశంసనీయం
- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: ప్రపంచ శాంతి కోసమే పత్రీజీ ధ్యానం చేస్తున్నారని, ధ్యాన మార్గంలో ఆయన చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మహాయాగం శుక్రవారానికి ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ.. మహేశ్వర మహా పిరమిడ్‌తో ఈ ప్రాంతానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. దీనికి దివంగత ధ్యాన గురువు సుభాష్ పత్రీజీయే కారణమని తెలిపారు. పత్రీజీతో పరిచయమైన అనంతరం తాను పూర్తిగా శాకాహారిగా మారిపోయానని, ప్రతి ఒక్కరూ ఆయనను అనుసరించి శాకాహార జగత్తుకు కృషి చేయాలని కోరారు. పత్రీజీ గొప్ప మహర్షి, కారణ జన్ముడని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ధ్యాన యజ్ఞం నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. విశాఖపట్నం ఎంపీ భరత్ ప్రసంగిస్తూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఠాధిపతి రాజరాజేశ్వరనందా, వసుంధైక ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగేంద్ర, ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


ధ్యానంలో కళాకారిణి

వ్యక్తి అదృశ్యం


వెంకటేశ్ (ఫైల్)

హయత్‌నగర్: క్రిస్మస్‌కు తన సోదరుడి ఇంటికి వెళ్దామంటే భార్య నిరాకరించడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఈ ఘటన శుక్రవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు రవిశంకర్ కాలనీకి చెందిన పోకల వెంకటేశ్ ఓ ప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్. ఆయనకు ఏడాదిక్రితం పల్లవితో వివాహమైంది. బుధవారం క్రిస్మస్ పండుగకు ఇంటికి రావాలని వెంకటేశ్ సోదరుడు పోకల గాబ్రెల్ వారిని ఆహ్వానించాడు. తనకు ఆరోగ్యం బాగోలేదని భర్తను వెళ్లమని పల్లవి చెప్పింది. దీంతో మనస్తాపం చెందిన వెంకటేశ్ గురువారం డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. భార్య ఫోన్ చేసినా స్పందించలేదు. శుక్రవారం మరోసారి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. పల్లవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



హయత్‌నగర్: వ్యవసాయ పొలం వద్ద ఉన్న ఓ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన శుక్రవారం హయత్‌నగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం.. తుర్కయాంజాల్ నుంచి బ్రాహ్మణపల్లికి మార్గంలో కొంతం నర్సింహారెడ్డి పొలం వద్ద ఫెన్సింగ్ పక్కన ఓ మృతదేహం కనిపించిందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు హయత్‌నగర్ పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 60 ఏళ్లు ఉంటుందని.. ఎవరైనా గుర్తిస్తే తమను సంప్రదించాలన్నారు.

కొయ్యలను కాల్చొద్దు


పోతుగల్‌లో నిప్పంటించిన కొయ్యలు

నిప్పంటిస్తే పంట దిగుబడికి ముప్పు

- కలియదున్నితే భూసారం పెంపు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

షాబాద్: పంట కోతలు పూర్తయిన తర్వాత రైతులు తమ పొలంలోని వరి కొయ్యలను కాల్చుతూ యాసంగి సాగుకు సిద్ధమవుతున్నారు. దీంతో భూసారం దెబ్బతింటోంది. పంటకు అవసరమైన సూక్ష్మజీవులు చనిపోయి దిగుబడి ప్రభావం పడుతుంది. మండల వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతూ రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలపై అవగాహన కల్పిస్తున్నారు.

భూమిలో పోషకాలకు నష్టం

నిప్పుతో భూసారం దెబ్బతింటుందని.. సాగుకు ఉపయోగపడే పోషకాలైన నైట్రోజన్, పాస్ఫరస్, పొటాషియం వంటి పోషకాలు నశించడంతో పాటు భవిష్యత్‌లక్ష పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడుతుంది. పొగ వల్ల వాయుకాలుష్యం పెరుగుతుంది. దీంతో రైతులకు ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలు తలెత్తనున్నాయి. నిప్పుతో మట్టిలోని సూక్ష్మజీవులు దెబ్బతిని మట్టి జీవచక్రం అస్తవ్యస్తం కానుంది. నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం తగ్గి పంటలకు ఎక్కువ నీరు అవసరం అవుతుందని వ్యవసాయ శాస్త్రవేతలు చెబుతున్నారు.

ఇష్టానుసారంగా వరి కోతలు

హార్వెస్టర్లతో వరికోతలు చేపడుతున్న సమయంలో కొయ్యలను సగం వరకే కోయడంతో సమస్య తలెత్తుతుంది. దీంతో వాటిని కాల్చడం తప్పడంలేదని రైతులు వాపోతున్నారు. పశుగ్రాసానికి సైతం ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరం పొలంలోని పశు గ్రాసానికి రూ.3వేలు చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వెల్లిబుచ్చుతున్నారు.

భూసార పరీక్షలపై నిర్లక్ష్యం

ఏడాదిలో ఒక్కసారయినా వ్యవసాయ భూముల్లో మట్టి సేకరించి వ్యవసాయ అధికారులు పరీక్షలు చేసిన దాఖలాలు లేవు. భూసార పరీక్షలు నిర్వహించి భూమిలో అనుకూలమైన పంట వేయాలని అధికారులు చూచించాలని రైతులు కోరుతున్నారు.

సబ్సిడీపై పనిముట్లు అందించాలి



కొయ్యకాళ్లు నరకడానికి ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందించాలి. విత్తనాలపై రాయితీ ఇవ్వాలి. పంటల సాగుపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలి. – అంజయ్య, రైతు మక్తగూడ

కొయ్యకాళ్లను కలియదున్నాలి



వరి కొయ్యలను కాల్చడం కన్నా పొలంలోనే కలియదున్నితే కాల్షియం, మెగ్నీషియం లాంటి సూక్ష్మపోషకాలు వృద్ధి చెందుతాయి. అలాగే పంటకు మేలుచేసే సూక్ష్మజీవులు పెరుగుతాయి. భూమిలో నత్రజని శాతం సైతం వృద్ధి చెందుతుంది. రైతులు భూ పరిరక్షణకు భాగస్వాములు కావాలి. – వెంకటేశం, ఏఓ షాబాద్

లీగ్ పోటీల్లో రన్నరప్‌గా తాండూరు జట్టు


తాండూరు సహారా క్రికెట్ అకాడమీ జట్టు

తాండూరు టౌన్: తెలంగాణ జూనియర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో తాండూరు జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ నెల 23నుంచి 27వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన అండర్ –16 టీ–20 టోర్నీలో ఆదిలాబాద్, నిర్మల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్ జిల్లా నుంచి తాండూరులోని సహారా క్రికెట్ అకాడమీ జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌కు చేరుకున్న తాండూరు జట్టు హోరాహోరీగా పోరాడి రన్నరప్‌గా నిలిచింది. ఈటోర్నీలో ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా, ఉత్తమ కీపర్‌గా తాండూరు జట్టు క్రీడాకారులు అంకుశ్ (255 పరుగులు), శివశంకర్ (8 డిస్మిజల్స్) అవార్డు అందుకున్నారు. టోర్నీలో సత్తాచాటిన క్రీడాకారులను కోచ్ జగన్నాథ్‌రెడ్డి, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

మన్మోహన్‌సింగ్ మరణం తీరనిలోటు

స్పీకర్ ప్రసాద్‌కుమార్



అనంతగిరి: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందడం యావత్ దేశానికి తీరని లోటని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. దేశం ఒక గొప్ప నాయకున్ని, ఆర్థికవేత్తను కోల్పోయిందన్నారు. ఆయన నిరాడంబర జీవితంతో ఎంతో మంది నేతలు అనేక విషయాలు నేర్చుకుని ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. పీవీ నర్సింహారావు నేతృత్వంలో ఆర్థి కమంత్రిగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చా రని గుర్తు చేసుకున్నారు. 2004 నుంచి రెండు పర్యాయాలు ప్రధానిగా ఈ దేశానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరువలేమన్నారు.

మధుబన్ కాలనీలో 'కార్డన్ సర్చ్'

- అనుమానాస్పద ప్రాంతాల్లో మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల తనిఖీలు
- నిషేధిత గుట్కా ప్యాకెట్ల స్వాధీనం
- ధ్రువపత్రాలు లేని వాహనాల సీజ్
- గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు: ఇన్‌స్పెక్టర్ నరేందర్


మధుబన్ కాలనీలో పోలీసుల కార్డన్ సర్చ్

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి కార్డన్ సర్చ్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్ ఆధ్వర్యంలో మధుబన్ కాలనీలోని పలు ప్రాంతాల్లోని దుకాణాల్లో నిల్వ చేసిన నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వాహనాలకు సరైన నెంబర్ ప్లేట్లు, ధ్రువపత్రాలు లేని వాటిని సీజ్ చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్ మాట్లాడుతూ... మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇతర రాష్ట్రాలకు చెందిన అనేక మంది వలస కార్మికులు వచ్చి నివాసం ఉంటున్నారన్నారు. చాలా దుకాణాల్లో నిషేధిత గుట్కాలను విక్రయిస్తూ చట్టాలను ఉల్లంఘిస్తున్నారన్నారు. వీటిని ఉపేక్షించమన్నారు. కొన్ని ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు తమకు సమాచారం అందుతుందన్నారు. గంజాయి విక్రయించిన, సేవించిన చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి ఇలాంటి వారిని గుర్తిస్తున్నారన్నారు. ఇప్పటికే పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలను చేపడుతున్నామన్నారు. కార్డన్ సర్చ్‌లో ఎస్ఐ సైదినాయుడు, ఏఎస్ఐ వెంకటరెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: గంజాయి విక్రయిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 1.1 కిలోల గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లాకు చెందిన మూడు సంతోష్ అనే వ్యక్తి తరచూ ఖమ్మం నుంచి గంజాయిని తీసుకువచ్చి భరత్ రమేష్‌బాబు అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు అప్పగించేవాడు. శుక్రవారం అతను వసంతనగర్ బస్టాప్ వద్ద శుక్రవారం భరత్ రమేష్ బాబుకు గంజాయి అప్పగిస్తుండగా పోలీసులు దాడి చేసి రమేష్ బాబును అదుపులోకి తీసుకున్నారు. సంతోష్ వారికి చిక్కకుండా తప్పించుకున్నాడు.

శాంతిభద్రతలే లక్ష్యం

- చట్టాన్ని గౌరవించాలి
- దుద్యాల్ ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి


నూతన పీఎస్‌లో ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది

దుద్యాల్: లగచర్ల ఘటన నేపథ్యంలో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టిసారించింది. ఇందులో భాగంగా దుద్యాల్‌లో నూతన పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడ తొలి ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన భరత్‌కుమార్‌రెడ్డిని కలిసిన 'సాక్షి' శుక్రవారం పలు అంశాలపై ఆయనతో ముచ్చటించింది. వివరాలు ఎస్ఐ మాటల్లోనే.. ప్రతీక్షణం ప్రజలకు అందుబాటులో ఉండి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తా. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తాం. అందుకు తగ్గట్టుగా ప్రతీ గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. చట్టాలు, డయల్ 100పై విస్తృత ప్రచారం చేస్తాం. ప్రజలందరూ గొడవలకు దూరంగా ఉండాలి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిని ఉపేక్షించేది లేదు. ఏ సమస్యలు ఉన్నా సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలి. చిన్నచిన్న కారణాలతో గొడవలు పెద్దవి చేసుకోవద్దు. మండల ప్రజల మనోభావాలకు ప్రాధాన్యం ఇస్తాం. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలి.

సంతోషంగా ఉంది

కొత్త మండలంలో తొలి ఎస్ఐగా బాధ్యతలు తీసుకోవడం సంతోషంగా ఉంది. గతంలో నవాబుపేట, కొడంగల్, తాండూరులో విధులు నిర్వర్తించా. పోలీస్ స్టేషన్‌కు నాతో కలిపి 27 మంది సిబ్బందిని కేటాయించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకుంటాం.

– భరత్‌రెడ్డి, దుద్యాల్ ఎస్ఐ

భక్తులపై వీధికుక్కల దాడి

యాలాల: మండల పరిధిలో కొనసాగుతున్న ముద్దాయిపేట ఎల్లమ్మ జాతరలో భక్తులపై వీధికుక్కలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు వెంటనే వారిని తాండూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శుక్రవారం ప్రారంభమైన ఈ జాతరకు వివిధ ప్రాంతాలనుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సాయంత్రం సిడే ఊరేగింపును చూసేందుకు వచ్చిన పలువురు భక్తులు, మహిళలపై వీధికుక్కలు దాడి చేసి కరిచాయి. ఈ ఘటనలో విశ్వనాథ్‌పూర్, పగిడియాల గ్రామాలకు చెందిన మహిళలతో పాటు ధారూరు మండలానికి చెందిన పలువురు మహిళలు గాయపడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు క్షతగాత్రులను వైద్యులు నగరానికి రిఫర్ చేశారు.

మహిళ మెడలోంచి గొలుసు చోరీ

అనంతగిరి: బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఓ మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ చేశారు. ఈ ఘటన వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ శివారులోని శివరాంనగర్ కాలనీకి చెందిన భ్రమరాంబ సదాశివపేటలో ఉండే కూతురు ఇంటికి మధ్యాహ్నం బయలుదేరింది. బస్సు ఎక్కి కూర్చుని మెడలో గొలుసు చూసుకోగా కనిపించలేదు. దీంతో బస్ నిలిపి ప్రయాణికుల వద్ద చెక్ చేసినా కనిపించలేదు. దీంతో బాధితురాలు వికారాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరిట మోసం


డబ్బులు ఇచ్చి మోసపోయిన బాధితులు సాయమ్మ, హన్మంతు

- ఒక్కొక్కరి వద్ద రూ.13వేల నుంచి రూ.40వేల వరకు టోకరా
- మోసపోయామని గ్రహించి పీఎస్‌కు పరుగులు
- మధ్యవర్తి నుంచి డబ్బులు ఇప్పించాలని బాధితుల పట్టు


ఠాణాలో మధ్యవర్తి రాములమ్మ

ధారూరు: ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేసిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని హరిదాస్‌పల్లికి చెందిన చింతకుంట రాములమ్మ నెల క్రితం యాలాల మండలం కోకట్ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడ శ్రీను అనే వ్యక్తి పరిచయమయ్యాడు. మాటలు కలిపిన మోసగాడు తాను కొండగల్‌లో ప్రభుత్వ ఉద్యోగినని.. పది మంది మహిళల చొప్పున గ్రూపులు తయారు చసి ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేయిస్తే అందరికి ఇళ్లు మంజూరు చేయిస్తానని నమ్మించాడు. అతని మాటలు నమ్మిన రాములమ్మ ధారూరు వస్తే తనకు తెలిసిన వారిని పరిచయం చేస్తానని చెప్పింది. ధారూరులోని ఓ బంగారం షాప్ దగ్గరకు వచ్చిన శ్రీను రాములమ్మను అక్కడకు రమ్మన్నాడు. ఆమె వెంట వచ్చిన వారికి మాయ మాటలు చెప్పి ఇళ్ల కోసం ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున ఇవ్వాలన్నాడు. మాటలు నమ్మిన హరిదాస్‌పల్లికి చెందిన ఏర్పుల సాయమ్మ రూ.20 వేలు, అనంతమ్మ రూ.13వేలు, పద్మమ్మ రూ.8వేలు చొప్పున రాములమ్మ ద్వారా సమర్పించుకున్నారు. అనంతరం మున్నూరుసోమారం గ్రామానికి చెందిన హన్మంత్ నుంచి రూ.30 వేలు రాబట్టాడు. ఇలా రాములమ్మ ద్వారా మండలంలోని పలువురిని పరిచయం చేసుకుంటూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పేరిట రూ.వేలల్లో రాబట్టి జారుకున్నాడు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇంటింటి సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు మాకు ఎలాగో ఇళ్లు మంజూరు అవుతుందని.. మీకెందుకు వివరాలు చెప్పాలని ఎదురు ప్రశ్నించారు. అనంతరం బాధితులు అధికారులకు ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులు ఇచ్చామని చెప్పారు. దీంతో మోసపోయారని చెప్పడంతో బాధితులు రాములమ్మ వద్దకు వెళ్లి తమ డబ్బులు ఇప్పించాలని పట్టుబట్టారు. దీంతో ఆమె శ్రీనుకు ఫోన్ చేసి చెప్పడంతో డబ్బులు తీసుకువస్తున్నాని వికారాబాద్‌కు రమ్మని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. చివరకు బాధితులు తమకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నారు. దీంతో ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ శ్రీను ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. పోలీసులు రాములమ్మను విచారించగా ముందుగా తానే రూ.40వేలు ఇచ్చానని ఎస్‌కు వివరించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కలప రవాణా చేస్తున్న లారీ సీజ్

కుల్కచర్ల: కలప అక్రమంగా రవాణా చేస్తున్న లారీని సీజ్ చేశారు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఫారెస్ట్ అధికారులు తెలిపిన ప్రకారం మండల పరిధిలోని అడవి వెంకటాపూర్ శివారులో హైమద్ అనే వ్యక్తి తన లారీలో అనుమతులు లేకుండా కలప తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మొయినుద్దీన్ ఘటనా స్థలికి చేరకుని హైమద్‌పై కేసు నమోదు చేసి లారీని పరిగి అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. శనివారం ఉన్నతాధికారుల ఆదేశానుసారం జరిమానా విధిస్తామన్నారు.